సాక్షి
వికారాబాద్
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



బంధాలు మరచి..

ఆస్తి తగాదాలు, ప్రేమ వ్యవహారాలు హత్యలకు దారి తీస్తున్నాయి. ఇంటువంటి సంఘటనలు ఇటీవల పెరిగాయి. 8లో▸



పెరిగిన భూగర్భ జలాలు

సీజన్ ప్రారంభం నాటి నుంచి ఆశించినంతగా వర్షాలు కురువక బోరుబావుల్లో నీరు పూర్తిగా అడుగంటిపోయాయి. 8లో▸



'ఉపాధి'పై సామాజిక తనిఖీ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మండలంలోని గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 86 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణికి అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ దరఖాస్తులు స్వీకరించారు. ఎవరి పరిధిలోని సమస్యలను వారి పరిష్కరించాలని లేదంటే ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూడూరు తహసీల్దార్‌గా విజయ్‌కుమార్



పూడూరు: పూడూరు తహసీల్దార్‌గా విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్‌గా వీరేశ్ బాబు, సీనియర్ అసిస్టెంట్‌గా వీరేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ భరత్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌చారి, సీనియర్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

దౌల్తాబాద్ డీటీగా వెంకటేశ్‌చారి



దౌల్తాబాద్: దౌల్తాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటేశ్‌చారి నియామకం అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న చాంద్‌పాషా బొంరాస్‌పేట కు బదిలీ అవ్వడంతో ఆయన స్థానంలో పూడూరు డీటీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌చారి మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'ఐజల్ స్టేషన్' సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లిలో ఐజల్ స్టేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ముందుకు వచ్చిన ఐజల్ స్టేషన్ స్వచ్ఛంద సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, మాజీ సర్పంచ్‌లు వెంకటరెడ్డి, ప్రభాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు విజయ్ కుమార్, ఎక్బాల్, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, మల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఇద్దరు బాలికలు

రాష్ట్ర స్థాయిలో రెండు గోల్డ్, ఓ సిల్వర్ పతకం



సాధించిన మెడల్స్‌తో క్రీడాకారిణిలు

తాండూరు టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు వర్సిటీలో 11వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో జిల్లా బాలికలు సత్తాచాటారు. జూనియర్ అథ్లెటిక్స్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ట్రయాథ్లాన్ విభాగంలో టి.ప్రణవి గోల్డ్ మెడల్ సాధించగా, వరలక్ష్మి 5వేల మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్, 3 వేల మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధు మాట్లాడుతూ.. ప్రణవి, వరలక్ష్మి త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

యూరియా కొరత.. రైతన్న వెత

క్యూలైన్‌లో తోపులాట

వానాకాలం పంటల ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరినాట్లు వేసే పనులు మొదలవడంతో యూరియా కోసం పనులు మానుకుని సహకార సంఘాల వద్దకు పరుగులు పెడుతున్నారు. రోజుల తరబడి నిరీక్షించినా ఒక్కొక్కరి ఒక్కో బస్తా ఇచ్చి పంపుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

- స్పృహతప్పి పడిపోయిన అన్నదాత
- పోలీస పహారాలో టోకెన్ల జారీ



తాండూరు రూరల్: పెద్దేముల్ ఎఫ్‌ఏసీఎస్ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు

తాండూరు రూరల్: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. పెద్దేముల్ మండల కేంద్రంలోని ఎఫ్‌ఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. టోకెన్ల కోసం భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో రైతుల మధ్య తోపులాట జరిగి జనగాం గ్రామానికి చెందిన పెద్ద మల్లప్ప స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో అధికారులు టోకెన్లు జారీ చేశారు. అయితే ఒక్కరికి ఒకే బస్తా ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేసుకుంటున్నామని యూరియా సరిపోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై ఏఓ పవన్ ప్రీతంను వివరణ కోరగా.. పెద్దేముల్ ఎఫ్‌ఏసీఎస్‌కు 10 మెట్రిక్ టన్నుల యూరియా(200) బస్తాలు వచ్చాయన్నారు. యూరియా కొరత విషయమై జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లామని, మరో 200 బస్తాల యూరియా త్వరలో వస్తోందన్నారు.

ఐదు సంచుల కోసం ఆందోళన

ధారూరు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా సోమవారం ఒక్కో రైతుకు రెండు సంచుల చొప్పున యూరియా పంపిణీ చేశారు. తమకు కనీసం ఐదు సంచుల చొప్పున ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. ఉదయం 6 గంటలకే తిండితిప్పలు లేకుండా క్యూ కట్టిన రైతన్నలకు ఒక్కో సంచి మాత్రమే ఇస్తామని సీఈఓ, సిబ్బంది తెలపడంతో ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి నచ్చజెప్పినా వినకుండా కార్యాలయంలోకి చొచ్చుకుపోయారు. రైతులను శాంతింపజేసేందుకు రెండు సంచుల చొప్పున ఇస్తామని సీఈఓ అంగీకరించారు. పోలీసుల సమక్షంలో ప్రశాంతంగా పంపిణీ చేశారు.



కొడంగల్ రూరల్: కడా కార్యాలయంలో అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రతీక్ జైన్

అధికారులదే బాధ్యత

- అభివృద్ధి పనులను వేగిరం చేయాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ రూరల్: కడా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం పట్టణంలోని కడా కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించి నిధులు మంజూరు చేసిందన్నారు. పనులకు ప్రొసీడింగ్స్ ఇచ్చినా పనులు ప్రారంభించకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాఠశాలల్లో మోడ్రన్ టాయిలెట్స్ నిర్మించాలన్నారు. కేజీబీవీల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, విద్యుత్, మిషన్ భగీరథ, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో రహదారుల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ, సీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, జిల్లా అటవీశాఖాధికారి జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్



కలెక్టరేట్ నుంచి సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ, అదనపు కలెక్టర్లు

భారీ వర్షాలు, వరదసాయంపై సెక్రటేరియట్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎస్పీ, జిల్లా స్థాయి అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ కొడంగల్ కడా కార్యాలయం నుంచి పాల్గొనగా, కలెక్టరేట్ నుంచి ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న టీఎన్‌జీఓ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఓపీఎస్‌ను అమలు చేయాలి

- టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

అనంతగిరి: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 సీపీఎస్ విద్రోహదినం సందర్భంగా సోమవారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. 2024 సెప్టెంబర్ 1 తర్వాత నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ శాపంగా మారిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే సీపీఎస్ విధానాన్ని తొలగించి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి సుదర్శన్, ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షుడు ఎజాజ్ అహ్మద్, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు అఫ్జల్, మున్సిపల్ ఉద్యోగుల అధ్యక్షుడు రామకృష్ణ, టీఎన్‌జీఓ, టీజీఓ, నాల్గవ తరగతి ఉద్యోగులు, కార్యవర్గ సభ్యులు, ఆయా శాఖల ఉద్యోగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టించండి సారూ..!

ప్రజావాణిలో వృద్ధుడి వేడుకోలు

నవాబుపేట: ఉన్న భూమి కొడుకులు తీసుకొని హైదరాబాదులో ఉంటున్నారు మమ్మల్ని చూసేవారు లేరు.. మాకు అన్నం పెట్టించండి.. సారు అని ఓ వృద్ధుడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చిట్టిగిద్ద గ్రామానికి చెందిన బాపు నరసింహారెడ్డికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు అశోక్ ఉపాధ్యాయుడిగా, చిన్నకొడుకు రామ్‌రెడ్డి మున్సిపల్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన పేరున ఉన్న 14 ఎకరాల భూమిని.. ఇద్దరు కొడుకులకు సమానంగా పంచి ఇచ్చాడు. నర్సింహారెడ్డి తన భార్యతో కలిసి గ్రామంలో నివసిస్తుండగా ఇద్దరు కుమారులు నగరంలోనే ఉంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమను కొడుకులు పట్టించుకోవడం లేదని, తిండికి కూడా కష్టంగా మారిందని నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈమేరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన నర్సింహారెడ్డి

'ఘోష్'.. పొలిటికల్ కమిషన్



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

అనంతగిరి: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన ఘోష్ కమిషన్.. పక్కా పొలిటికల్ కమిషన్ అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా బీఆర్‌ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నదీ జలాలను పక్కరాష్ట్రాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను పక్కకు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును బంద్‌చేసే కుట్రలో భాగంగా చర్చలు నిర్వహించడం, కేసును సీబీఐకి అప్పగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ–కాంగ్రెస్ కుట్రలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు అశోక్, శేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, గోపి తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' పనులు చేపట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

షాద్‌నగర్‌రూరల్: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని పాలమూరు అధ్య యన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా లక్ష్మీదేవిపల్లి పనులు చేపట్టలేదని, రిజర్వాయర్ నిర్మాణాన్ని మాటలకే పరిమితం చేస్తోందని విమర్శించారు. ఏదుల డిండి పథ కానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1,832 కోట్లు కేటాయించి నల్లగొండకు నీళ్లు తరలించే యత్నం చేస్తోందని, రూ.232 కోట్లతో ఎస్ఎల్‌బీసీ కాలువకు లైనింగ్ పనులు చేపడుతోందని, లక్ష్మీదేవిపల్లిని మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. గత పాలకులు ప్రాణహిత చేవెళ్ల రీడిజైన్‌లో చేవెళ్ల లేకుండా, పాలమూరు రంగారెడ్డి రీడిజైన్‌లో లక్ష్మీదేవిపల్లి లేకుండా చేశారని అన్నారు. పాలమూరు రంగారెడ్డిని నల్లగొండకు పంపకుండా జూరాల నుంచి నీటిని తెచ్చి లక్ష్మీదేవిపల్లిలో కలపాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాల కోసం ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఓటువేసేందుకు ఎంపీలు ముందుకు రావాలని కోరారు.సమావేశంలో రవీంద్రనాథ్, నర్సింలు, రామారావు, తిరుమలయ్య, అర్జునప్ప, జైపాల్‌రెడ్డి, ఖాజాషబ్బీర్ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు

డీసీఓ నాగార్జున

బంట్వారం: ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని జిల్లా కోపరేటివ్ అధికారి (డీసీఓ) నాగార్జున అన్నారు. సోమవారం బంట్వారం సహకార సంఘం సీఈఓ బ్రహ్మం పదవీ విరమణ చేయడంతో ఆయనకు సంఘం కార్యాలయంలో అభినందన సభ ఏ ర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన డీసీఓ బ్రహ్మం దంపతులను సన్మానించి మా ట్లాడారు. సీఈఓగా బ్రహ్మం సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించి మంచి పేరు గడించారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, నూతన సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



బ్రహ్మం దంపతులను సన్మానిస్తున్న డీసీఓ నాగార్జున తదితరులు

సహకారం సంఘం సీఈఓగా శ్రీనివాస్



బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం బంట్వారం సీఈఓగా ఎం.శ్రీనివాస్‌కు పదో న్నతి కల్పించినట్లు జి ల్లా కోపరేటివ్ అధికా రి (డీసీఓ) నాగార్జున సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఇప్పటి వరకు సీఈఓగా విధులు నిర్వహించిన బ్రహ్మం సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో అభినందన సభకు హాజరైన డీసీఓ నాగార్జున ఇక్కడే విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు బంట్వారం సొసైటీ సీఈఓగా పదోన్నతి కల్పించామన్నారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు.

మాల్‌ను సందర్శించిన ఉత్తరప్రదేశ్ బృందం

యాచారం: జాతీయ స్థాయిలో ఆత్మ నిర్భర్ నేషనల్ పంచాయతీ అవార్డు దక్కించుకున్న మాల్ గ్రామ పంచాయతీని సోమవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం సందర్శించింది. పంచాయతీ స్వశక్తితో ఏ విధంగా ఆర్థిక బలోపేతం అయింది.. ఇంటి పన్నుల వసూలు.. పశువుల సంత వేలం పాట ద్వారా ఏటా వచ్చే ఆదాయం.. గ్రామంలో అభివృద్ధి పనుల తీరుపై బృందం సభ్యులు అధ్యయనం చేశారు. ఈజీఎస్ నర్సరీ, పల్లెప్రకృతి వనం, పశువుల సంత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో టీఎస్ ఐపార్డ్ అధికారులు అనిల్ కుమార్, స్మిత, ఎంపీడీఓ రాధారాణి, మండల పంచాయతీ అధికారి శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీలో రికార్డుల నిర్వహణ గురించి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

సంచార చేపల విక్రయ వాహనం అందజేత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన వరలక్ష్మికి మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి సోమవారం సంచార చేపల విక్రయ వాహనం అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రుల చేతుల మీదుగా ఆమె వాహనంకీ అందుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహ, ఐకేపీ ఏపీఎం రామస్వామి, సీసీ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

మైసిగండి మైసమ్మ సన్నిధిలో శాసనసభ స్పీకర్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక సిబ్బంది, నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

డీజేలు వినియోగిస్తే కేసులు

సీఐ భీంకుమార్



అనంతగిరి: వికారాబాద్‌లో జరిగే నిమజ్జనోత్సవంలో డీజేలకు అనుమతి లేదని వికారాబాద్ టౌన్ సీఐ భీంకుమార్ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజేలు వినియోగిస్తే డీజే యాజమాని, నిమజ్జనం ఆర్గనైజర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని కమలానగర్ ఏరియాలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొందరు వ్యక్తులు గొడవకు దిగి అక్కడి ప్రజల శాంతికి భంగం కలిగించారు. వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

ప్రమాదవశాత్తు రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



బిచ్చిరెడి (ఫైల్)

దోమ: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం చుక్కన్నగారి బిచ్చిరెడ్డి(80)సోమవారం మృతి చెందారు. వికారాబాద్, దోమ, పరిగి, నస్కల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన ఆయన సోమవారం తన వ్యవసాయ క్షేత్రంలో కూలీలతో మొక్కలు నాటిస్తుండగా కాలు జారి కింద పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష

మహేశ్వరం: పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ముఖేష్(23).. తుక్కుగూడ మంఖాల్‌కు వలస వచ్చాడు. 2024లో ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అప్పట్లో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎల్బీనగర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తాజాగా సోమవారం కేసు విచారించిన న్యాయమూర్తి.. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెలువరిచారు. బాధితురాలికి రూ.50 వేల నష్ట పరిహారం ప్రకటించారు.

యువకుడి ఆత్మహత్య

ఆమనగల్లు: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తలకొండపల్లి మండలం అంతారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణయ్య(35)కు 12 సంవత్సరాల క్రితం విజయతో వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా దంపతుల మధ్య గొడవలు జరగగా.. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, సఖ్యతగా ఉండాలని సూచించారు. సోమవారం ఉదయం ఇరువురి మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో విజయ కూలిపనులకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో కృష్ణయ్య ఇంటి పైకప్పు గొట్టానికి ఉరి వేసుకుని బలవన్మరణం చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసుల తెలిపారు.

వృద్ధురాలిని ఇంటికి చేర్చిన పోలీసులు

ఆమనగల్లు: మానసిక స్థితి సరిగా లేని వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు.. ఆమెను కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ వద్ద ఓ వృద్ధురాలు పడి ఉందని ఆదివారం రాత్రి 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు బ్యాంకు వద్దకు చేరుకుని, వివరాలు తెలుసుకునే యత్నం చేశారు. అయితే ఆమె చెప్పలేని స్థితిలో ఉండటంతో.. సంచిని తినిఖీ చేయగా ఆధారం కార్డు లభించింది. పేరు మారమ్మ, మిడ్జిల్ మండల కేంద్రంగా గుర్తించి, కుటుంబీకులకు అప్పగించారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయండి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు

యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల నుంచి వెళ్లిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యా సంవత్సరం మధ్యలో టీచర్లు బదిలీపై వెళితే.. పిల్లల భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించారు. పాఠశాలను ఎంత అభివృద్ధి చేసినా.. ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులకు మెరుగైన విద్య ఎలా అందుతుందని వాపోయారు. దీనికి స్పందించిన కలెక్టర్.. విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోడ కృష్ణ, రవీందర్‌గుప్తా, నరేష్, శ్రీశైలం, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బంధాలు మరచి.. కత్తులు దూసి

- హత్యలకు దారితీస్తున్న ఆస్తి తగాదాలు, ప్రేమ వ్యవహారాలు
- ఆందోళన కలిగిస్తున్న వరుస సంఘటనలు
- ఆదివారం దండుమైలారంలో దారుణం
- 11 గుంటల భూ పంచాయితీలో ఇరువర్గాల దాడి
- ఒకరి మృతి, చావుబతుకుల మధ్య మరొకరు
- ఉద్రిక్తతల నడుమ ముగిసిన బాలరాజు అంత్యక్రియలు



దండుమైలారంలో రోడ్డుపై బైఠాయించిన బాల్‌రాజ్ బంధువులు

ఇబ్రహీంపట్నం: ఆస్తి తగాదాలు, ప్రేమ వ్యవహారాలే దారుణ హత్యలకు దారి తీస్తున్నాయి. రక్త సంబంధాన్ని మరచి, దాడులకు పాల్పడుతున్న సంఘటనలు ఇటీవల తరచూ చోటుచేసుకొంటున్నాయి. గతేడాది రాయపోల్ గ్రామంలో ఓ మహిళా కానిస్టేబుల్.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇది సహించని సోదరుడు.. ఆమెను నడిరోడ్డులో హతమార్చాడు. తల్లిదండ్రులు లేని ఆ కుటుంబంలో ఉన్న ఒక్క తోడును కడతేర్చి, అతను జైలు పాలయ్యాడు.

కన్నతల్లి చేతిలో తనయ..

దండుమైలారంలో అదే సంవత్సరం కూతురు ప్రేమ వ్యహారంపై కన్నతల్లి నిలదీసింది. ఈ సంఘటనలో తనయ కన్నతల్లి చేతిలో ప్రాణాలు కోల్పోయింది. క్షణికావేశంలో జరిగిన ఘటనలో ఓ పక్క కుతూరిని కోల్పోయి, కేసుల్లో చిక్కుకొని ఆ కుటుంబం అల్లాడిపోయింది. మూడేళ్ల క్రితం కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ పరిధి పెద్ద చెరువు సమీపంలో భూ తగాదాలో నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారు. ఈ ఘటనలోని నిందితులు జైలు పాలయ్యారు. ఇటీవల గున్‌గుల్‌లో ఇంటి పక్క ఉన్న ఓ డ్రైనేజీ గొడవ ఓ హోంగార్డును బలి తీసుకుంది.

11 గుంటల భూమి కోసం..

పై హత్యోదంతాలు మరువక ముందే.. కేవలం 11 గుంటల భూ తగాద.. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఆదివారం దండుమైలారం గ్రామ శివార్లలో దాయాదులే గొడ్డళ్లు, కత్తులతో దారుణంగా దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో బాల్‌రాజ్ అనే వ్యక్తి మృత్యువాత పడగా.. మరో మహిళ మంజుల చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. మరో ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొదుతున్నారు. వీరంతా ఒకే కుంటుంబంలోని అన్నదమ్ముల వారసులు. భవిష్యత్తు పరిణామాలను అంచనా వేసుకోకుండా, క్షణికావేశంలో జరుగుతున్న హత్యలతో ఆయా కుటుంబాలు ఎంతో నష్టపోతున్నాయి.

ముగిసిన అంత్యక్రియలు

దాయాదుల చేతిలో హతుడైన బాల్‌రాజ్ అంత్యక్రియలు సోమవారం దండుమైలారం గ్రామంలో ఉద్రిక్తతల నడుమ ముగిశాయి. ఉదయం నుంచి మృతుడి బంధువులు గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన వ్యక్తంచేశారు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ఎస్ఐలు, పోలీసు బలగాలను ఆ గ్రామంలో బారీ సంఖ్యలో మోహరించి పరిస్థితి చేజారకుండా పర్యవేక్షించారు. మృతుడి కుటుంబానికి గ్రామ పెద్దలు, పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రెండు ఎకరాల భూమిని బాధిత కుటుంబాలకు ఇచ్చేందుకు ప్రత్యర్థి వర్గం ఒప్పుకున్నట్లు సమాచారం. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.



ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న మహిళ మంజుల

పెరిగిన భూగర్భ జలాలు

- నిండిన చెరువులు, కుంటలు
- వరి సాగు పనుల్లో బిజీ అయిన రైతులు

దుద్యాల్: సీజన్ ప్రారంభం నాటి నుంచి రెండు నెలల పాటు ఆశించినంతగా వర్షాలు కురువకపోవడంతో బోరుబావుల్లో నీరు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో రైతులు పంటలను సాగుచేయడాని వెనడుగు వేశారు. కొంత మంది బోరుబావుల్లో తక్కువ నీరు లభ్యం కావడంతో పండించే విస్తీర్ణం తగ్గించారు. దీంతో రైతుల పాలిట అదృష్టం ఆలస్యంగా వరించింది. 20 రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఎక్కడికక్కడ చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. బోరుబావుల్లో భూగర్భ జలాలు అమాంతం పెరగడంతో రైతులు తిరిగి వరినాట్లు వేసే పనిలో బిజీ అయ్యారు. వర్షాకాలం ఆలస్యమైనా సరే పంటలు పడించుకునే అవకాశం రావడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగుకు ఇబ్బందిలేకుండా పోయాయి.

రబీకి సరిపడా..

ఇప్పుడు కురిసిన వర్షాలకు ప్రస్తుతం సాగు చేసుకునే పంటలకు కాకుండా మునుముందు రబీలో వేసే పంటలకు కూడా జీవం పోశాయని రైతులు చెబుతున్నారు. రబీలో వేరుశనగ, తెల్ల కుసుమ, జొన్న, శనగ వంటి పలు రకాల పంటల సాగుకు నీరు అధికంగా కావాలి. చెరువులు, కుంటలు నిండుగా ఉండడంతో బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోకుండా వేసవికాలం వరకు బాగా నీరు పోస్తాయి. రబీలో ఎక్కువగా ఆరుతడి పంటలు సాగుకు రైతులు మొగ్గు చూపుతారు. వాటికి అధిక నీరు అవసరం ఉండదు. అందుకు తగ్గట్టుగా ఉన్న బోర్లలో నీరు సరిపోయి పంటలు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



హస్నాబాద్ పెద్ద చెరువుకు జలకళ



కళకళలాడుతున్న వరి పైరు

పంటల నమోదు తప్పనిసరి

ఏడీఏ శంకర్ రాథోడ్

కొడంగల్ రూరల్: రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయశాఖ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కొడంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) శంకర్ రాథోడ్ సూచించారు. సోమవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాల్లోని రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు గ్రామాల వారీగా, సర్వే నంబర్ వారీగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల కొనుగోలు, రైతులకు పంట నష్ట పరిహారం, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలను పొందేందుకు వీలుంటుందని చెప్పారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ(ఏఈఓ) అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

పంటల నమెదు చేసుకోవాలి

పూడూరు: రైతులు వేసుకున్న పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పూడూరు మండల వ్యవసాయ అధికారి తులసీరాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు మండల రైతులు తమ క్లస్టర్ల పరిధిలోని రైతువేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి

పూడూరు: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి రైతులకు న్యాయం చేయాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో బాధిత రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడంతో రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో గ్రామం సమీపం నుంచి తిప్పాపూర్ ఫారెస్టు మీదుగా రోడ్డు వస్తుందని చెప్పి ప్రభుత్వం సర్వే నంబర్‌లను విడుదల చేయడంతో రైతులు తమ బతుకులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఉన్న ఎకరా కోల్పోతే ఎలా జీవనం సాగించాలని ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులు తాజొద్దీన్, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

తెలంగాణ మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

తాండూరు రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అర్ధకాలితో అలమటిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈఓ రేణుకాదేవిలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా మండలాల్లో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది(కంప్యూటర్ ఆపరేటర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, అటెండర్లు, వాచ్‌మెన్)లుగా పని చేస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించ లేదన్నారు. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించండి

ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్ రూరల్: టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. సోమవారం టీజీఈ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ వద్ద నిరసనలు వ్యక్తం చేసేందుకు ఆయా సంఘాల నాయకులు తరలివెళ్లారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి పాత పెన్షన్‌ను తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం పెన్షన్ లేకపోవడం తీవ్ర నష్టానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆడుకుంటూ.. ఆటో చక్రాల కింద నలిగి

- 16 నెలల బాలుడి దుర్మరణం
- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు

అబ్దుల్లాపూర్‌మెట్: అప్పటిదాకా బంతితో ఆడుకున్న బాలుడు.. అంతలోనే తండ్రి ఆటో చక్రాల కింద నలిగి మృత్యువాత పడ్డాడు. ఆటోను వెనుకకు తీస్తున్న క్రమంలో బాలుడిని గమనించని నరేష్.. అలాగే వెళ్లడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటకు చెందిన క్లెం నరేష్, అతని భార్య, పిల్లలతో కలిసి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా నివాసముంటూ ఆటోనడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటలకు ఇంటి ఎదుట ఆటోను వెనుకకు తీస్తుండగా.. అతని 13 నెలల కుమారుడు లోహిత్ ఆడుకుంటూ వెనుక నుంచి ఆటో కిందకి వచ్చాడు. ఇది గమనించని నరేష్.. ఒక్కసారిగా ఆటోను వెనుకకు తీయగా.. బాలుడి తలపై నుంచి వెళ్లింది. తీవ్రగాయాలతో లోహిత్ చనిపోయాడు. దీంతో ఒక్కసారిగా షాక్ గురైన తల్లిదండ్రులు.. కళ్లముందు ఆడుకుంటున్న పసివాడి ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసి పోవడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

జంతువుల దాడి.. 23 మేక పిల్లలు మృతి

కందుకూరు: గుర్తు తెలియని జంతువుల దాడిలో మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధి సరస్వతిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదరబోని అంజయ్య ఆదివారం మేక పిల్లలను దొడ్డిలో ఉంచి, పెద్దవి గొర్లు, మేకలను మేత కోసం సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి దొడ్డిలోని 23 మేక పిల్లలు విగత జీవిగా పడున్నాయి. వాటి గొంతు కొరకడంతోనే మృతి చెందినట్లుగా గుర్తించారు. ఇది కుక్కల పనా, లేక ఏదైనా జంతువు చేసిందా అనేది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి కన్యాకుమారి పరిశీలించారు. బాధితుడికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

రోడ్డు నాణ్యత ఏది?

సిరిగిరిపేట్‌లో అధికారులను ప్రశ్నించిన మహిళలు

తాండూరు రూరల్: మండలంలోని సిరిగిరిపేట్ నుంచి సంకిరెడ్డిపల్లి గ్రామం వరకు నిర్మిస్తున్న లింక్‌రోడ్డు పనుల్లో నాణ్యతను పాటించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం సిరిగిరిపేట్ గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డుకు సంబంధించి కొలతలు తీసుకునేందుకు పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం, ఏఈ నందిని వచ్చారు. ఈ క్రమంలో సదరు అధికారులను స్థానిక మహిళలు ప్రశ్నించారు. పట్నం యాదమ్మ ఇంటి నుంచి కాల్వర్టు వరకు 100 మీటర్ల వరకు నిర్మించిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించలేదన్నారు. వృథానీరు వెళ్లేందుకు రోడ్డు కింద వేసిన పైప్ కూడా చిన్నదిగా ఉందన్నారు. రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో తమ ఇళ్లముందుకు నీరు చేరుతుందన్నారు. ఇదిలా ఉండగా సదరు లింక్‌రోడ్డుకు రూ.1.15 కోట్లు మంజూరైనట్లు డీఈ నాగభూషణం తెలిపారు. నాణ్యత లేదని అధికారులు నిర్ణయిస్తారని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తారని స్థానికులు తెలిపారు.



సిరిగిరిపేట్‌లో పంచాయతీరాజ్ అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

ఇంటి నిర్మాణంపై బాధితుడి ఫిర్యాదు

కేశంపేట: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శి ఆపుతున్నాడని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌కు బాధితుడు వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా బాధితుడు మంచర్ల కిష్టయ్య మట్లాడుతూ.. మండల పరిధిలోని మంగళిగూడలో సర్వే నంబర్ 134లో 50 సంవత్సరాల క్రితం రెండెకరాల 20 గుంటల వ్యవసాయ భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించిందన్నారు. ఇట్టి స్థలంలో 7-96 ఇంటి నంబర్‌తో ఇళ్లు కూడా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అందులో తన కవేలితో కూడిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో.. అధికారులు గుర్తించి ఇందిరమ్మ ఇంటిని తన భార్య వెంకటమ్మ పేరుపై మంజూరు చేశారన్నారు. ఇంటి నిర్మాణం పిల్లర్ల వరకు వచ్చిన తర్వాత ఇంటి పక్కనే ఉండే కొట్టాం కొండల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో కార్యదర్శి ఇంటి నిర్మాణాన్ని ఆపుతున్నాడని తెలిపారు. ఇప్పటికే బేస్మెంట్ వరకు ఇందిరమ్మ బిల్లు కూడా వచ్చినట్లు బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదు అందించిన వారిలో గ్యార సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న బాధితుడు మంచర్ల కిష్టయ్య

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



లక్నాపూర్ ప్రాజెక్టు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటయ్య తదితరులు

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా సాగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య కోరారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్నాపూర్ ప్రాజెక్టులో గణేశ్ నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నిమజ్జనానికి వచ్చేవారు పోలీసుల, అధికారులకు సలహాసూచనలు పాటించాలన్నారు. రక్షణ వలయం లోపలనే నిమజ్జనం చేయాలని సూచించారు. నిబంధనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సాయం ఉన్న వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా టు హైదారాబాద్



పోలీసుల అదుపులో నిందితులు



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

- ఆర్టీసీ బస్సుల్లో గంజాయి తరలింపు
- పోలీసులకు దొరికిన నిందితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గుట్టు చప్పుడు కాకుండా ఆర్టీసీ బస్సుల్లో గంజాయి తరలిస్తున్న ముఠాను.. ఆదిబట్ల, మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ కబాసి(35) అనే వ్యక్తి, వరుసకు అక్క అయ్యే జోగి మడకమి(42) ఇద్దరు కలిసి గత రెండు రోజుల క్రితం ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించేందుకు ప్లాన్ వేసుకున్నారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో చింతూరు మీదుగా భద్రాచలంలో దిగి, మరో బస్సులో ఎల్బీనగర్‌కు చేరుకున్నారు. బొంగ్లూర్ సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవించే దేబ కబాసి.. తమ్ముడు అర్జున్‌కు పోన్‌చేసి, బొంగ్లూర్ వస్తున్నామని చెప్పడంతో బస్సు దిగగానే పోన్ చేయమని అర్జున్ చెప్పాడు. వారు దిగగానే వారి దగ్గరకు వచ్చిన అర్జున్.. సంచుల్లో ఏముందని అడగడంతో గంజాయి ఉందని కబాసి, జోగి చెప్పారు. దీంతో అర్జున్ భయపడి వెళ్లిపోయాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని సోదా చేయగా.. 10 కేజీల గంజాయి ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కాగా.. వారి వద్ద దొరికిన గంజాయిని ఒడిశాలోని మల్కాన్‌గిరిలో పలాసి నూకరాజు వద్ద రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది.

గొర్ల కాపరిపై అటవీ అధికారి దాడి

ఆమనగల్లు: గొర్రెల కాపరిపై దాడి చేసి, పొట్టేల్‌ను అపహరించిన అటవీ అధికారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబీకులు, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కటికల నారాయణ.. సమీపంలోని చీపునుంతల అటవీ ప్రాంతానికి రెండు రోజుల క్రితం గొర్రెలను మేపడానికి వెళ్లాడు. ఈ సమయంలో గొర్రెలు ఫారెస్టు ఏరియాలోకి వచ్చాయని పేర్కొంటూ.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహ్మద్ అబ్దుల్ అజీజ్.. కాపరిపై దాడిచేసి గాయపరిచి, మందలో నుంచి గొర్రె పొట్టేల్‌ను తీసుకెళ్లాడు. దీంతో ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. పోలీసులను ఆశ్రయించారు. ఇందులో బాధితుడి కుటుంబీకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, నాయకులు శేఖర్‌యాదవ్, జంగయ్య, పాండు, మల్లేశ్, రాజు, చెన్నయ్య ఉన్నారు.